# అభిమానపు అంచులలో...



'ప్రమిద' త్రైమాస పత్రిక . . . జనవరి - ఏప్రిల్ ' 2005

"ఏమీ ఫర్వాలేదురా... నా మాట విను!"

– మరోసారి సుదర్శనం హెచ్చరిస్తూంటే ఏమిచేయాలో తెలీక డైలమాలో పడ్డాను.

"అది కాదురా!"

"ఏది కాదు?! నోరు మూసుకొని నన్ను ఫాలో అవుతున్నావంతే!!"

"ఏం బాగుంటుంది చెప్పు... ఇక్కడికొచ్చి మోసం చేయడం?" ఇక ఏమి మాట్లాడాలో తెలియలేదు నాకు.

కానీ, అవసరం అటువంటిది! అసలు శంకర అగ్రహారం నుండి శబరిమలై వచ్చాం. మొదట్లో అయ్యప్పస్వామి దర్శనం మాత్రమే అనుకున్నాం. ఇరుముడి దించడం, స్వామి దర్శనం చేసుకోవడం పెద్దగా శ్రమపడకుండా అయిపోయాయి. దానితో రామేశ్వరం కూడా చూసి పోదామన్నాడు సుదర్శనం.

బ్రహ్మచారిని అయినా ఉద్యోగంలో ఎప్పుడూ శెలవు పెట్టడానికి ఇష్టపడేవాడిని కాదు. కానీ, ఈసారి మరో వారంరోజులు పెట్టిన శెలవు ఉండటంతో రామేశ్వర యాత్ర మంచి అవకాశం అనిపించింది. "సరే..." అన్నాను మరోమాట లేకుండా.

తీరా వచ్చేసరికి– ఉండటానికి బస సమస్య అయి కూర్చొంది. సీజన్ కావడంతో ఉన్న రెండు మూడు హోటల్స్ చూస్తే ఒక్కదాంట్లోనూ ఎకామ్‌డేషన్ దొరకలేదు.

"మరి, ఏం చేద్దాం!" ఏమీ తోచక అడిగాను సుదర్శనాన్ని. మాట్లాడలేదు వాడు.

"పోనీ, దర్శనం చేసుకొని ఈవెనింగ్ సేతు ఎక్స్‌ప్రెస్‌కి పోతే సరి!"

"నాతో రా!" అన్నాడు ఎదురుగా కనబడుతున్న సత్రం బోర్డు వైపు చూస్తూ.

వాడి చూపులతో నేనూ జత కలిపాను. ఒకింత ఆశ్చర్యం... మరికొంత ఉద్వేగం నాలో!

"రూమ్ దొరికినట్లే!" అన్నాడు హుషారుగా.

"అక్కడ... నీతో... నేను..." అన్నాను బిడియపడుతూ.

"యస్... నాతోనే నువ్వు! ముందర అక్కడ కూడ పొజిషన్ ఎంక్వైర్ చేద్దాం... రా!" అంటూ నా చెయ్యి పట్టుకు నడిచాడు సుదర్శనం.

ఒకింత అయిష్టంగానే ఆ 'గాయత్రీ బ్రాహ్మణ అన్నదాన సత్రం' వైపు అడుగులు వేశాను వాడితో కలిసి. బోర్డు మీద 'ఈ సత్రం బ్రాహ్మణ కులస్థులకు మాత్రమే!' అని ఉంది.

"నాలుగు రోజులు ఉంటాము సార్!" అన్నాడు సత్రం మేనేజర్‌తో.

"రెంట్ రోజుకు వంద! సత్రంలో ఉదయం భోజనం, రాత్రి టిఫిన్ ఫ్రీ!" అన్నాడు ఆయన లెడ్జర్‌లో వివరాలు రాస్తూ.

"నా పేరు సుదర్శనం... వీడు మా బంధువు శ్రీనివాస్!" అన్నాడు కనీసం నావైపు చూడకుండానే.

అర్థంకావడం లేదు నాకు– దేవుడి దగ్గరకొచ్చి మోసం చేయడం... మనసంతా బరువుగా ఉంది.

వాడు బ్రాహ్మిణ్ కావడంతో ఇక్కడ ఎన్ని రోజులైనా ఉండొచ్చు. కానీ, వేరే కులస్థుడనైన నేను విషయం దాచి వాడితో కలసి... ఇక్కడ?! నాలో ఏదో తెలియని అపరాధ భావన!

"రా... రా..!" నా చేతిలోని బ్యాగ్ కూడా వాడే తీసుకొని ముందుకు నడిచాడు సుదర్శనం.

"ఎవరైనా అడిగితే 'నేనూ పంతులే!' అని చెప్పు. గోత్రం అంటే గౌతమన అను!" అన్నాడు.

"ఇదేం బాగుంది చెప్పు... నాకు మనసొప్పడం లేదు!" అబద్ధం చెప్పడం ఇష్టంలేక అన్యమనస్కంగానే అన్నాను.

"దీంట్లో ఏముందిలేవోయ్! బయట హోటల్స్‌లో ప్రయత్నం చేశాం. రూమ్ దొరకలేదు. అయినా నువ్వు నాతో గెస్ట్‌గా వచ్చావ్... నీకేం కాదులే!!" అన్నాడు సుదర్శనం.

లోపల రూమ్స్ అన్నీ బాగానే ఉన్నాయ్. అంతా సనాతన వాతావరణం, వైదీక ధోరణి! కొన్ని నిమిషాలు నాకు ఫ్రీగా లేకపోయినా విచిత్రంగా ఉంది. మనుషుల్ని ఆసక్తిగా గమనించసాగాను.

ఉదయాన్నే సంధ్యావందనం చేసేది ఒకరైతే...

పురుష సూక్త, స్త్రీసూక్తాలు వల్లె వేసేది మరొకరు...

నమక చమకాలతో సాలిగ్రామానికి అభిషేకం చేసేది ఒకాయన!

– తెలియని వింత అనుభూతి ఆవహించసాగింది నన్ను.

ఒక్కసారి నాకు మా గురువు ముకుందశర్మ గుర్తుకువచ్చారు. శర్మగారంటే మా ఊరులో అందరికీ అభిమానం! అప్పట్లో నాకు చదువు చెప్పిన అమృతమూర్తి! నిత్య అనుష్టానాలతో శాస్త్రోక్త క్రతువు నరనరాల్లో జీర్ణించుకున్న నిప్పులాంటి మనిషి ఆయన.

వాళ్ళబ్బాయి భవానీప్రసాదు నా సహాధ్యాయి! నేను వేరే కులస్తుడనయినా నన్ను ఎన్నడూ చిన్నచూపు చూడలేదు. వాళ్ళింట్లో వాళ్ళ మంచాన పడుకొనేవాడిని. వారి సహపంక్తిని భోజనం చేసేవాడిని. ఆయన నన్ను తన సొంతకొడుకులా ఆదరించేవారు.

ఆరోజుల్లో వాళ్ళ పెద్దబ్బాయి వయసు మీరుతున్నా పెళ్ళి పట్ల ఆసక్తి చూపలేదు. ఎన్నో సంబంధాలు వస్తున్నా ఏదో వంక పెట్టి తిప్పిపంపేవాడు. కొడుకు ఒక ఇంటివాడు కానందుకు ఆయన భార్య తల్లడిల్లిపోయేది... ఎన్నోసార్లు నచ్చచెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

"చూడబ్బాయ్! మాకా వయసు మీదకు వస్తోంది. నువ్వా ఏదో ఉద్యోగం చేసుకుంటూ ప్రయోజకుడవయ్యావ్. మీ అమ్మకూ, నాకూ నువ్వు ఒక ఇంటివాడివి కావాలని కోరిక. నువ్వు ఏదో ఒక అమ్మాయిని చూసుకొని మూడు ముళ్ళూ వేస్తే మా బాధ్యత కొంత తీరిపోతుంది. కానీ, కాలంతో కలిసి నడవక దాటేస్తున్నావ్. పోనీ, నీ మనసులో ఎవరైనా అమ్మాయి ఉంటే చెప్పు– మాకు ఏ విధమైన అభ్యంతరం లేదు. ఆమెది మన కులం కాకపోయినా నాకు పెద్ద పట్టింపు లేదు. ముందు నీ సుఖం ముఖ్యం... తర్వాతే మిగతావన్నీను!"

ముకుందశర్మగారి మాటలు నాకు చాలా ఆనందం కల్గించాయి. సంకుచితత్వానికి అతీతమైన ఆయన విశాల దృక్పథం నాకు చాలా విశేషంగా అన్పించింది. అమూల్యమైన ఆయన వ్యక్తిత్వానికి మనసులోనే హేట్సాఫ్ చెప్పాను.

ఆనాటినుండి ఆయనన్నా, బ్రాహ్మణ జాతి అన్నా నాలో ఒక ప్రత్యేకమైన గౌరవస్థానం ఏర్పడింది. చివరికి నాన్న మాటలలోని ఆర్తిని గ్రహించిన వాళ్ళబ్బాయి తన తల్లి చూపించిన అమ్మాయి మెడలో తాళి కట్టేశాడు.

ఆ అనుభవంతోనే 'గాయత్రీ బ్రాహ్మణ అన్నదాన సత్రం' నన్ను అందమైన ఆలోచనల్లో పడేసింది.

"సముద్ర స్నానానికి పదరా!" సుదర్శనం పిలుపుతో ఆలోచనల్ని కట్టిపెట్టి, వాడిని అనుసరించాను.

అలలు పెద్దగా లేని హిందూ మహాసముద్రం నిశ్చలంగా కనిపిస్తోంది. శంకరమఠం అగ్నితీర్థంలో నీరు స్వచ్ఛంగా పొర్లుతోంది. ఒడ్డును ముద్దాడి చిన్నగా వెనక్కి తిరుగుముఖం పడుతోంది.

అక్కడి వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది. ఉదయాన్నే బస్సులో వస్తుంటే చూసిన పంబన్ బ్రిడ్జి, మండపం స్టేషన్ దగ్గరనుండి కనబడుతూన్న సేతువారధి నాకు ఆనందాన్ని కలుగజేస్తూనే ఉన్నాయి.

చాలామంది యాత్రికులు అక్కడ స్నానాలు చేస్తున్నారు. వారిలో మేమూ ఇద్దరం అయ్యాం.

"దీపదానానికి, శివలింగ పూజకు మనిషికి ఐదువందలు. మీ నలుగురికి కలిపి రెండువేల రూపాయలు అవుతుంది!" కొంతమంది స్త్రీలు అడుగుతూంటే... ఖచ్చితంగా చెబుతున్నారు అక్కడి పురోహితులు.

"లేదు స్వామీ... మనిషికి వందకు మించి ఇచ్చుకోలేం!" ప్రాధేయపూర్వకంగా అడుగుతున్నారు వాళ్ళు.

కాదంటే కాదంటున్నాడు ఆయన. ఐదు వందలకు ఒక్కపైసా కూడా తగ్గేది లేదంటున్నాడు. సాధారణంగానే నా దృష్టి అటువైపు మళ్ళింది.

వాళ్ళు మళ్ళీమళ్ళీ అడుగుతున్నారు. ఆయన 'ససేమిరా' అంటున్నాడు. నాలో ఏదో అసహనం తొణికిసలాడుతోంది. బ్రాహ్మణులంటే అచంచలమైన విశ్వాసం గల నాలో ఆ క్షణంలో తెలియని అంతర్మథనం!

చివరికి చేసేదిలేక ఒప్పుకున్నారు వాళ్ళు. వాళ్ళనే గమనిస్తున్నాను నేను. సుదర్శనం దూరంగా సముద్రంలో జలకాలాడుతున్నాడు.

లింగ ప్రతిష్ట, దీపదానం క్రతువు త్వరత్వరగా ముగించడానికి తంటాలు పడుతున్నారు పంతులుగారు. మధ్యమధ్యలో ఆగి, మరో బేరం కోసం ప్రయత్నం చేస్తున్నాడు.

నాకు చాలా నిరాశగా ఉంది. పాపం... ఎంతో దూరం నుండి వ్యయప్రయాసల కోర్చి వచ్చినవారి ముఖాలలోనూ అదే భావన కదలాడుతోంది.

విశ్వాసం, నమ్మకం, సంతృప్తి అనేవి మనిషి జీవన విధానానికి ఓ నిఘంటువు అన్పిస్తుంది నాకు. అసలు అర్థంకాని నాలుగు సంస్కృత మంత్రాలతో ఆవాహన చేసి, 'ఇక సరి!' అనడం ఎంతవరకు సబబు?!

'పూజావిధానంతో భక్తులను ఆకట్టుకొని, తృప్తిగా భగవంతుని కొలుచుకున్నాము' అన్న నమ్మకం భక్తులలో కలగజేయడం అక్కడ తప్పనిసరి!

ఏ వృత్తిలోనైనా ఇతరుల్ని సంతృప్తి పరచి, విశ్వాసాన్ని కలుగజేసి ఆకట్టుకోగల్గడం ఎంతో ముఖ్యం. దానికి వైదీకం అతీతం కాదేమో!

ఆర్థిక అవసరాలు ప్రముఖపాత్ర వహించే వర్తమాన సమాజంలో వీరు కూడా డబ్బుకు అతీతులు కాదేమో... అన్పించసాగింది.

భౌతికపరమైన జీవన విధానానికి వైదీక సంస్కృతి ఛిద్రమైపోతోందా..?!

"మేమూ మనుషులమే గదా! ఫలపుష్పాలు తిని జీవించలేం కదా!" అని వారు అనొచ్చు. కానీ, మన డిమాండ్ ఎదుటివ్యక్తికి మనస్తాపం కల్గించేలా ఉండకూడదని నా భావన.

త్యాగానికి, ధర్మానికి, పుణ్యఫలానికి ప్రతీకగా ఉండవలసిన చోట- డబ్బు ప్రముఖ పాత్ర వహించడం రుచించలేదు నాకు.

ఒకానొకప్పుడు ఆధిపత్యం చెలాయించి సమాజాన్ని శాసించిన బ్రాహ్మణులు ఇప్పుడు ప్రాముఖ్యతను కోల్పోతున్నారన్న వాదన కొంతవరకు నిజమే అన్పించసాగింది.

తను చేయాల్సిన క్రతువుల్ని చేయకపోవడం, భౌతికవాదం వైపు మొగ్గుచూపడం, విలువలకు కొత్త నిర్వచనం ఇచ్చి సాంప్రదాయాలను పూర్తిగా విస్మరించడం, చేస్తున్న పనిలో శ్రద్ధ, ఇన్‌వాల్వ్‌మెంట్ కొరవడడం వంటి కారణాలు వారి సామాజిక ఉత్తేజానికి ప్రతిబంధకాలై ఉండొచ్చు.

ఇప్పుడు కొందరు బ్రాహ్మణ యువతులు వేరే వర్ణాల వారిని వివాహం చేసుకొనిపోవడం వెనుక ఆర్థిక స్థిరత్వం లేకపోవడం, లేమితనం వంటివి కారణం కావచ్చు.

ప్రపంచం బ్రాహ్మణులను దైవస్వరూపాలుగా భావించేది. కానీ, మారిన పరిస్థితుల దృష్ట్యా సామాజిక వేర్పాటుధోరణిని అలవరచుకోవడం, వారి పట్ల విశ్వాసాన్ని ప్రదర్శించకపోవడం అనేవి కొంతవరకు సహేతుకమే అవుతున్నాయి.

– తలచుకుంటే హృదయం బరువెక్కినట్లయింది నాకు!

ఆ ఆలోచనల తోనే సముద్రస్నానం పూర్తిచేశాను. సుదర్శనంతో కలిసి రామలింగేశ్వరస్వామి గుడివైపు నడిచాను. అక్కడ ఇరవై రెండు బావులలో స్నానం చేసిన తరువాత స్వామిదర్శనం కోసం 'క్యూ'లో నిలుచున్నాం. అక్కడా వ్యాపారధోరణి అలుముకుపోయివుంది. దేవుని ముంగిట పూజారుల రొఖ్ఖింపులు... పూజలకు బేరసారాలు!

– ప్రశాంతత కొరవడింది నాలో.

పురాణకాలం నాటి ఆ దేవతామూర్తుల్ని దర్శించుకొని బయటపడ్డాను. "ప్లేటులో దక్షిణ వేయండి!" అన్న అక్కడివారి డిమాండ్‌తో మనస్తాపం మరోసారి హృదయాన్ని ఆక్రమించుకొంది.

"పప్పు, కూర, చారు, మజ్జిగలు ఉన్నాయి. తృప్తిగా భోజనానికి కూర్చోండి!" సత్రం మేనేజరు సాదరంగా ఆహ్వానించాడు.

సుదర్శనంతో కలిసి నేనూ కూర్చున్నాను. ఎంతో హాయిగా, ప్రశాంతంగా ఉంది అక్కడ! ఇందాకటి మబ్బులు తొలిగిపోతూన్న భావన నాలో.

"స్వామీ... పప్పు మరింత వడ్డించమంటారా?!" తేనెలూరే పలుకులు తియ్యగా విన్పించాయి. తలవంచుకొని తింటూన్న నేను తలెత్తి చూశాను...

ఎవరో అమ్మాయి..! తమిళదేశంలో స్వచ్ఛంగా తెలుగు మాట్లాడే అమ్మాయి!!

ఆమెకు బిస్కెట్ కలర్ సాంప్రదాయబద్ధమైన దుస్తులు మరింత ఆకర్షణను కలుగజేస్తున్నాయి.

"ఏం స్వామీ... వడ్డించమంటారా?!" మరోసారి రెట్టించింది.

"మావాడికి అడగటానికి మొహమాటం!" చిన్నగా నవ్వుతూ అన్నాడు- ప్రక్కనే కూర్చున్న సుదర్శనం. నవ్వుకుంటూ పప్పు, కూర వడ్డించి ముందుకు కదిలింది.

ఆమె ముఖంలోకి చూశాను... రామేశ్వరంలోని పుణ్యఫలం అంతా ఆ అమ్మాయి నవ్వులో ద్విగుణీకృతమవుతోంది.

"ఎంత అందంగా ఉంది..." మడిబట్టలలోని ఆ హుందాతనం నాకు మరింత నచ్చింది.

మొత్తానికి భోజనాలు ముగించాం.

"రాత్రికి టిఫిన్ ఏర్పాట్లు ఉన్నాయి స్వామీ! తప్పక దయచేయండి!" మంద్రత నిండిన అదే స్వరంతో పలికింది.

నాకు మటుకు హాయిగా ఉంది. ఆత్మీయత నిండిన ఆమె భావజాలం నన్ను పరవశుణ్ణి చేస్తోంది. రూమ్‌కి వచ్చామేగాని, నా ఆలోచనలన్నీ ఆ అమ్మాయితో నిండిపోయి ఉన్నాయి.

కొసరి కొసరి వడ్డించడం... ఏ ఊరు నుండి వచ్చారని అడగటం... మా శంకర అగ్రహారం సంగతులు తెలుసుకోవడం... శబరిమలై యాత్ర వివరాలు సేకరించడం, 'ఎన్నిరోజులు ఉంటారు? బస బాగుందా? లేదా..?' అని తెలుసుకోవడం... అన్నీ ముచ్చట గొలుపుతున్నాయి నాకు.

వయసు ముప్పై ఏళ్ల వరకూ ఉండొచ్చు. ఇంకా పెళ్ళి అయినట్లు లేదు. కానీ, చక్కనైన రూపలావణ్యం... ఆకట్టుకొనే హృదయలావణ్యం ఆమె సొత్తు అనిపించసాగింది.

సుదర్శనం వైపు చూశాను. అప్పుడే వాడు నిద్రలోకి జారుకున్నాడు. రూమ్‌లో ఫ్యాన్ క్రింద కూర్చున్నాను. కిటికీలోంచి ఆ అమ్మాయి అప్పుడప్పుడు కనిపిస్తూనే ఉంది.

పేరు ఏమయి ఉంటుందో..?! బహుశా ఏ 'బాలవర్ధనో..', 'పర్వతవర్ధనో...' అయివుంటుంది. బాలవర్ధనయితేనే బాగుంటుంది. పేరులోనే ఉంది 'చిన్న' అని! పర్వతవర్ధిని అనుకోడానికి పర్వతంలా లేదు కదా... నాజూకు అంతా తానైన నారీమణి అయితేనూ!

హృదయం ఉప్పొంగింది నాలో... చక్కగా పెళ్ళీడుకొచ్చిన పిల్ల- ఇక్కడ, ఇలా సత్రంలో వంటలు చేసుకుంటూ... అమ్మానాన్నలు ఎక్కడ ఉన్నారో... వారి స్థితిగతులు ఎలాంటివో?!

బ్రాహ్మణీకుల కుటుంబాలు, వారి స్థితి గురించి కొంచెం కొంచెం తెల్సిన నాకు దృష్టి మరలా అటువైపుకు మళ్లింది. ఈ కరవు కాలంలో ఎంతమంది విప్రకుటుంబాలు దుర్భర దారిద్ర్యాలతో రోజులు వెళ్ళబుచ్చుతున్నారు! కాయకష్టం అలవాటు లేక, నలుగురిలో ఒకరిగా మసల లేక, విరక్తి భావనతో బ్రతుకునీడుస్తున్నవారు ఎందరో.

కాకపోతేం... ఈ అమ్మాయి పిల్లాపాపలతో నలుగురిలో ఒకరిగా ఉండవలసిన కాలంలో ఇలా మడి- దడి, పూజలూ- పునస్కారాలంటూ... నా మనస్సు చివుక్కుమంది.

కిటికీలోంచి వంటగదిని హోస్‌పైప్ వాటర్‌తో క్లీన్ చేస్తూ కన్పిస్తోంది.

'అలసట' అంటే ఏమిటో తెలియనిదానిలా ఉంది. ఉదయం నుంచి వంటావార్పులతో క్షణం తీరిక లేకపోయినా... ముఖంమీద ఆ అలసట ఛాయలే కన్పించడం లేదు. నవ్వుతూ పనిమనిషికి పనులు పురమాయిస్తోంది.

నాకు మటుకు 'ఎందుకులే...' అనుకుంటున్నా ఆలోచనలన్నీ ఆమెచుట్టూ తిరుగుతున్నాయి.

"టీ త్రాగుతారా! అమ్మగారు అడిగిరమ్మన్నారు!" పనిమనిషి వచ్చి అడిగింది.

"ఈ సత్రంలో మధ్యాహ్నం టీలు ఇవ్వరు గదా!" అడిగాను.

"ఏమోం... అమ్మగారు అడిగిరమ్మన్నారు!" అంది.

"ఫరవాలేదులే!" అన్నాను మొహమాటంగా.

వెళ్లిన పనిమనిషి ఐదు నిమిషాల్లో టీకప్పుతో తిరిగివచ్చింది. చాలా సంతోషంగా ఉంది నాకు. ఊరు కాని ఊరులో ఎవరో తెలియని నాకు పిలిచి 'టీ' ఇచ్చినందుకు.

ఆరోజు రాత్రి మా ప్రక్కరూమ్ లోనే ఉంటున్న ఓ ముసలి దంపతులు... ఆవిడకు ఓ డెబ్బై సంవత్సరాల పైన ఉండొచ్చు. దేవాలయంలోని నూతుల స్నానంతో జలుబు చేసినట్లుంది. టెంపరేచర్, చలి ఎక్కువ అవడంతో వణికిపోతోంది. ఆ తాతగారు వచ్చి నా సహాయం కోరారు.

ఎప్పుడూ క్రోసిన్ టాబ్లెట్స్ బ్యాగ్‌లో పెట్టుకొనే నేను– ఈసారి ఎందుకో మర్చిపోయాను. పోనీ, బయటినుండి తెద్దామంటే ఆ అర్ధరాత్రి సమయంలో మందుల షాపులు తీసివుంటాయా?

చూసేసరికి ఆవిడ స్థితి దీనంగా ఉంది. ఏంచెయ్యాలో పాలుపోక వరండాలో పచార్లు చేస్తున్నాను. మనుషుల అలికిడికి ఆ అమ్మాయి రూంలో లైటు వెలిగింది. తలుపులు తెరుచుకున్నాయ్.

"ఏం స్వామీ! నిద్రపట్టలేదా!!" అంత నిద్రమత్తు లోనూ ఆమె నవ్వుముఖం ముచ్చటగొలిపింది నాకు. ప్రక్కగది మామ్మగారి సంగతి చెప్పాను.

"అరేఁ... ఇంతసేపు చెప్పలేదే!!" ఆత్రుతగా అటువైపుగా కదిలింది. టెంపరేచర్ ఎక్కువగా ఉండటంతో తన దగ్గరున్న టాబ్లెట్స్ తీసుకొచ్చి వేసింది. స్టోర్‌రూమ్‌లోని రగ్గు తీసుకొచ్చి ఆవిడకు కప్పింది. ఏం లాభం లేకపోయింది. చివరికి డిస్పోజబుల్ సిరంజ్‌తో ఇంజక్షన్ ఇచ్చింది.

క్రమంగా ఆ ముసలావిడ యథాస్థితికి చేరుకోసాగింది.

రాత్రి అంతా కంటికి రెప్పలా కాపాడుతూ అక్కడే గడిపింది. నేను కూడా కావాల్సిన సహాయం అందిస్తూ కూర్చోవలసి వచ్చింది. నాలుగు రోజుల పరిచయంలో ఆ సంఘటనతో మామధ్య కొంచెం చనువు ఏర్పడింది. ఆ వృద్ధురాలికి రాత్రంతా కూర్చొని సపర్యలు చేసిన విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకొంది.

ఇప్పుడు నా దృష్టిలో ఆ అమ్మాయి ఓ అపురూపమైన వ్యక్తి! మాటల మధ్య నా కోరిక నెరవేరింది... ఆమె పేరు శ్రీదేవి!

చూడచక్కనైన వ్యక్తిత్వంతో, మనసుతో మాటలు చెప్పే శ్రీదేవి ఎంత అదృష్టవంతురాలు? ఇటువంటి పవిత్రమైన ప్రదేశంలో పుణ్యంచేసుకొనే అవకాశం ఎంతమందికి కలుగుతుంది?

నెమ్మదిగా తెల్లారింది...

మధురమైన ఆమె ఊహలతోనే నిద్రలోకి జారుకున్నా! తిరిగి మెలకువ వచ్చేసరికి బారెడు పొద్దెక్కిపోయింది. టైము చూస్తే సాయంత్రం మూడు గంటలు!

సుదర్శనం ఒక్కడే సైటిసీయింగ్‌కి వెళ్లాడులా ఉంది. బయట వర్షం పడుతోంది. స్నానం చేసి కూర్చున్నాను.

చటుక్కున అంత వర్షంలోనూ తడుస్తూ పరుగున నా రూమ్‌లోకి వచ్చింది శ్రీదేవి. నమ్మలేకపోయాను. కేవలం లుంగీతో ఉన్న నేను ప్రక్కనే ఉన్న షర్ట్ అందుకున్నాను.

"భోజనం చేయకుండా నిద్రపోయారు!" చేతిలోని కేరియర్‌ని టేబుల్ మీద పెడుతూ అంది.

"మీకు శ్రమ ఇచ్చినట్లున్నాను..."

"ఎందుకు..? మీరు మాకు గెస్ట్... ముందు తింటూ కబుర్లు చెప్పండి!"

"థాంక్యూ... శ్రీదేవిగారూ!"

ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది. నా పేరు ఎలా తెలుసునన్న భావన ఆమెలో ద్యోతకమవుతోంది.

"శ్రీదేవి అని మాటల్లో రాత్రి తెల్సింది లెండి!"

"థాంక్స్..!"

"ఎందుకో..?!"

"సర్వీస్ చేయించుకొన్నవాళ్ళే గాని, ఇక్కడ పేరుపెట్టి ఆత్మీయంగా పలకరించింది మిమ్మల్నే చూశాను. రాత్రి అంతా మెలకువగా ఉండి ఆవిడకు ధైర్యం చెప్పారు. లేకుంటే పరిస్థితి మరింత ఇబ్బంది అయ్యేది!" భోజనం చేస్తూ ఆమె మాటలు గమనించసాగాను.

"చాల్లెండి... తిననిస్తారా? లేకపోతే కబుర్లతో నా కడుపు నింపేస్తారా?!"

పకపకా నవ్వింది.

"ఉండండి... ఏరుకోవాలి!"

"....................."

"అదేనండీ... రాలిన రత్నాలు పొర్లిపోకముందే పట్టుకోవద్దూ మరి!"

ఆమె నవ్వు మరింత అందంగా ఉంది.

"మీరు చేసుకోబోయేవాడు ఎవరో నిజంగా అదృష్టవంతుడు!"

హాయిగా నవ్వుతూన్న ఆమె ముఖంలో నవ్వు ఒక్కసారి మాయమైపోయింది.

బయట వర్షం కూడా చటుక్కున వెలిసిపోయినట్లయింది...

అంతా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

"చనువు తీసుకున్నానా..?!" భోజనం ముగించుకొని చేతులు కడుక్కుంటూ అన్నాను.

"అలా తీసుకోవడం నన్ను ఆకట్టుకుంటుంది!"

"నేను తప్పుగా మాట్లాడలేదే... యుక్తవయసులోని మీరు పెళ్ళిచేసుకొని స్థిరపడమన్నానంతే!"

"....................."

"మీరు చేస్తున్నది మంచి పని, పుణ్యకార్యం... కాదనను. కానీ, మనిషి జీవనవిధానంలో భౌతికపరమైన అంశాలు కొన్ని ప్రాముఖ్యత వహిస్తాయనుకుంటా!"

"....................."

"ఐమీన్... వివాహం, పిల్లలు, సంసారం, సుఖజీవనం! మనిషి జీవనస్రవంతిలో మీరు చేస్తున్న సేవ అంతర్భాగమవ్వాలి గాని, అది మిమ్మల్ని పూర్తిగా ఆక్రమించడం ఎంతవరకు సహేతుకమన్నది ప్రశ్న?!"

"మరి, ఆర్థిక వెసులుబాటు?" నా ముఖంలోకి చూస్తూ అంది శ్రీదేవి.

"మీ కుటుంబ వివరాలు తెలుసుకోవచ్చా?!" అడిగాను కుతూహలంగా.

"మాది ఆంధ్రప్రదేశ్‌లో ఒక దిగువ మధ్యతరగతి కుటుంబం! నాన్న వృత్తి పౌరోహిత్యం. ఎప్పుడూ నిప్పును కడిగినతర్వాతే మరో పని జోలికిపోయే తత్వం ఆయనది. పైసా ఆదాయం లేని వృత్తి... ఎవరినీ ఏమీ అడగని తత్వం... కడుపు నింపని పని! పూట గడవడం కష్టమైపోయేది. ఎవరైనా పౌరోహిత్యానికి పిలిచి ఐదు రూపాయల తాంబూలం చేతిలో పెట్టి ఐదులక్షలు ఊరికే ఇస్తూన్నట్లు ఫీలవుతుంటారు. దానితో మా చదువులు అటకలెక్కాయి. అన్నలందరూ చేసేందుకు మరొకటి లేక కులవృత్తినే ఎన్నుకున్నారు. నాకు చదువుకోవాలని ఉన్నా ఐదవ తరగతి మించి ముందుకు సాగలేదు.

వాళ్ళకు మరింత బరువు కాకూడదని గత ఐదేళ్లుగా వంటలు చేసుకుంటూ అక్కడ భగవత్ సన్నిధిలో కాలం వెళ్లబుచ్చుతున్నాను. ఇక్కడ జీతం అంటూ ఏమీలేకపోయినా – రెండుపూటలా భోజనం బాగానే దొరుకుతోంది!" ఆగిపోయింది శ్రీదేవి.

నవ్వుతూ వెండివెన్నెల్ని కాయించే ఆమె ముఖంలో నిరాశ చీకటి కమ్ముకుపోయివుంది.

ఆర్థిక స్థిరత్వం లేని బ్రతుకు ఎంత దుర్భరమో నాకు అవగతమవుతోంది. మానవతా విలువలన్నీ డబ్బుతోనే ముడిపడి ఉన్నప్పుడు నైతిక అంశాలు ఎంతవరకు మనగలుగుతాయి?

నా మస్తిష్కంలోని నరాలు తెగిపోతున్నట్లుంది నాకు. కులం ఏదయినా... మతం మరొకటి అయినా శ్రీదేవిలాంటి అమ్మాయిలు ఎందరో ఈ లోకంలో.

మళ్లీ తెచ్చుకున్న నవ్వుతోనే అంది –

"నన్ను పెళ్ళి చేసుకోబోయేవాడు చాలా అదృష్టవంతుడు అని ఇందాక మీరే కదా అన్నారు. ఆ ఊహని హృదయంలోంచి త్రుంచివేసి చాలాకాలమైంది నేను. ఇప్పుడు మీరు మరలా వాడిన మల్లెతీగకు నీరుపోసి చిగురింపజేశారు. పైకి పాకగల్గిన మల్లె అంటుకు ఆధారం కల్పించి... ఆ అదృష్టాన్ని మీరే అందుకోవచ్చుగా!" – పకపకా నవ్వింది. ఆ శబ్దంలో హేళన ధ్వనిస్తోంది.

త్రుళ్ళిపడ్డాను నేను.

రెండు నిమిషాలు నిశ్శబ్దం మామధ్య!

తేరుకొని మరలా ఆమే అంది –

"నాది స్వార్థం అంటారా?!"

"మీతోటి ఈ నాలుగురోజుల పరిచయంలో ఇంత ఆత్మీయతను పొందగలగడం నేను అదృష్టంగా భావిస్తాను. కానీ, మిమ్మల్ని నాదానిగా చేసుకుంటే ఆ స్వార్థం నాది అవుతుంది."

"అంటే..?"

"మీరు బ్రాహ్మణులు... అగ్ర కులస్థులు. వర్ణసంకరం మీకు నిషిద్ధమనుకుంటా!"

"......................"

"మీరనుకున్నట్లు నేను మీ కులస్థుణ్ణి కాదు... మాది వేరే కులం! సుదర్శనం బలవంతం మీద ఇక్కడకు రావాల్సివచ్చింది..." ఆగిపోయాను.

శ్రీదేవి నన్ను అసహ్యించుకుంటుందనుకున్నాను.

"తెలుసు!" అంది నవ్వుతూ.

నిజంగా ఆశ్చర్యపోయాను.

"ఎలా..?" విషయం అర్థంకాలేదు నాకు.

"గ్రహించలేని అమాయకురాల్ని కాదు నేను. అందరిలో భోజనానికి ముందు మీరు పట్టిన పర్యుంతోనే నాకు అర్థమయింది. మీరు నిజంగా బ్రాహ్మణులు కాదని తెల్సింది. గత నాలుగు రోజుల నుండి మీ విధానాలు అన్నీ గమనించాను. నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి."

పూలవాన కురిసినట్లుంది నాకు. ఆ క్షణంలో ముకుందశర్మగారు గుర్తుకువచ్చారు.

కులవ్యవస్థకు అతీతమైన శ్రీదేవి దృక్పథం ముందు ఆమె లేమితనం చాలా చిన్నవిషయంగా అన్పించసాగింది.

ప్రపంచంలోని వింతలన్నింటికన్నా ఆమె విశాల వ్యక్తిత్వం అపురూపంగా తోస్తోంది.

"నిజం చెబుతున్నా శ్రీనివాస్‌గారూ... శ్రీదేవి మీ తోడు కోరుకుంటోంది. నా ఆశల్ని సజీవంగా ఉంచగల్గుతారనుకుంటున్నాను. ఆలోచించి మీ నిర్ణయం చెప్పండి!"

- వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయింది.

●

రామేశ్వరం నుండి బయలుదేరడానికి బ్యాగ్ సర్దుతున్నాడు సుదర్శనం.

నా మనసు మనసులో లేదు. ఆత్మీయతను సంతరించుకున్న ఆ పరిసరాల్ని వదలడానికి హృదయం ససేమిరా అంటోంది.

శ్రీదేవికి మనసులోని మాట చెప్పాలి!

రాత్రి రాసుకున్న ఉత్తరాన్ని తీసి మరోసారి చదువుకున్నాను.

"ప్రియమైన శ్రీదేవికి...

గ్రహించే వుంటావు... 'మీరు'ని వదిలి నిన్ను 'నువ్వు' అని పిలవగల్గడం చాలా బాగుంది. నీతోటి దగ్గరతనం చాలా మధురంగా అన్పిస్తోంది. సెక్యులరిజమ్ శ్రీదేవిని ఆణిముత్యంగా చేసివుండొచ్చు.

పీడన ఎక్కడ వుంటుందో ఘర్షణ అక్కడ ఉద్భవిస్తుందంటారు. ఈ ప్రపంచం తీరే అంత! నా విషయంలో మటుకు భ్రమపడ్డ ప్రతిసారీ వివక్షత అనేదానిని చెరిపేసి, మీపట్ల అభిమానాన్ని పెంపొందిస్తూనే ఉన్నారు. దానిలో పాత్రలు ముకుందశర్మ... శ్రీదేవి... సుదర్శనం... ఎవరైనా కావచ్చు.

అందుకే ఎన్నో యుగాలుగా సంస్కృతిని పోషించి సంరక్షించిన వైదీక మీనాదు ఛిద్రం కాకూడదని, సజీవంగా వర్ధిల్లాలని నా మనసు కోరుకుంటోంది. నన్ను అర్థంచేసుకుంటావు కదూ!

డబ్బే ప్రతిబంధకం అయి, నీ మనుగడను శాసించడం అనేది సహించరాని విషయం. అందుకే ఓ ఆత్మీయుడిగా నీ పెళ్ళిసమస్యను నేను పరిష్కరింపదల్చుకున్నాను. నీకు అన్నివిధాలా యోగ్యుడైన వ్యక్తిని భర్తగా తెచ్చే బాధ్యత నాది.

ఇవి గట్టిమాటలు సుమా... ఒట్టిమాటలు మాత్రం కావు.

శ్రీదేవికి
ఆత్మీయతతో
శ్రీనివాస్."

- మడిచి జేబులో పెట్టుకుంటూ తూర్పు కిటికీ వైపు చూశాను.

హిందూ మహాసముద్ర గర్భంలోంచి చొచ్చుకొస్తున్న రవి కిరణాలు విశాలతను సంతరించుకొని ఆశాకిరణాలుగా తోస్తున్నాయి ఆ క్షణంలో నాకు.